
చారిత్రక కట్టడం.. శిథిలం


మినార్ పైభాగంలోని గుంబద్


మినార్‌పై పెచ్చులు ఊడిన దృశ్యం


కడప మినార్


మినార్‌పై పెరిగిన మొక్కలు

- కడప నవాబుల ప్రాభవాన్ని చాటుతున్న మినార్లు
- ఇస్లామిక్ నిర్మాణ శైలిలో ఏర్పాటు
- నిర్వహణ లేక.. మరమ్మతుకు నోచుకోక..

ఓ ప్రాచీన కట్టడాన్ని సందర్శిస్తే చరిత్రలోకి ప్రయాణించినట్లేనని చరిత్రకారులు అంటారు. కడప గొప్ప వారసత్వ కట్టడాలకు నిలయం. జాతి మూలాలకు సజీవ తార్కాణాలైన ఆ వారసత్వ సంపదలు క్రమంగా శిథిలమైపోతున్నాయి. కళలు, సంస్కృతికి ఎంతో ప్రాధాన్యమిచ్చిన మన ప్రాచీన పాలకులు ఎన్నో అద్భుత నిర్మాణాలు చేపట్టారు. కాలపరీక్షకు తట్టుకుని నిలిచిన ఆ కళాఖండాలను భావితరాలకు భద్రంగా అందించడం మన బాధ్యత. కానీ సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అందుకు నిదర్శనం నగరంలోని మినార్లు.

కడప కల్చరల్ : కడప నవాబుల వైభవ ప్రాభవాలను నేటితరానికి చాటుతూ నాటి చరిత్రకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచి ఉన్నాయి ఈ మినార్లు. కడప నగరం ఆవిర్భావాన్ని వివరిస్తూ నాటి ఇస్లామిక్ నిర్మాణ శైలిని నేటి తరానికి తెలుపుతున్నాయి.

- నగరానికి ప్రధాన వాణిజ్య కూడలిగా ఉన్న వైవీ స్ట్రీట్ నుంచి వెలుపలికి వచ్చే వారికి ఇవి స్వాగతం పలుకుతున్నట్లు కనిపిస్తాయి. కడప కళాక్షేత్రానికి పక్కనే పడమరవైపు వెళ్లే దారిలో ఈ మినార్లు కనిపిస్తాయి. సుమారైన కోటలాంటి ప్రహరీ నిర్మాణం, మధ్యలో ప్రధాన ఆకర్షణగా నిలిచివున్న ఈ మినార్లు నగరంతో పరిచయం గల వారందరూ చూసే ఉంటారు. ఇప్పటికి వాటిని నవాబుల కోటకు సంబంధించిన మినార్లుగానే భావిస్తున్నారు. దీంతోపాటు ఆ మినార్ల నిర్మాతలు, నిర్మాణం, వాటితో కడప నగరానికి గల అనుబంధం తదితర అంశాలు నేటి తరానికి ఆసక్తి గొలుపుతాయి.

చరిత్ర ప్రకారం..

అందిన సమాచారం మేరకు ఈ మినార్ల చరిత్ర ఇలా ఉంది. విజయనగర పాలన అంతమయ్యాక ఈ ప్రాంతం ముస్లింల ఆధీనంలోకి వచ్చింది. తళ్లికోట యుద్ధానంతరం ముస్లిం సైనిక దళాలు భవిష్యయుద్ధ అవసరాల కోసం కొత్త ప్రాంతాలలో సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకోవడం ఆరంభించాయి. గోల్కొండ నవాబు కులీకుతుబ్‌షా తన సైన్యంలోని ప్రముఖ యోధుడైన రజాక్ అలీని నమ్మకస్తుడైన కొందరు అనుచరులను 16–17 శతాబ్దాల్లో ఈ ప్రాంతానికి పంపాడు. పాలనా దక్షత, సంస్కరణ వాదం, ఆధ్యాత్మికత మెండుగా ఉండడంతో అందరూ రజాక్ అలీని నేక్‌నామ్‌ఖాన్ (ఉత్తముడు)గా వ్యవహరించేవారు. ఆయన ఈ ప్రాంతానికి వచ్చాక సైనిక స్థావరం ఏర్పాటు కోసం చాలా ప్రాంతాలను పరిశీలించి చివరికి బుగ్గవంక పరివాహక ప్రాంతంలోని మిట్టగా కనిపించిన ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నాడు. యుద్ధ అవసరాలు ఎదురైనపుడు వెంటనే సిద్ధం కావడానికి, దైనందిన అవసరాలు తీర్చుకునేందుకు ఈ ప్రాంతం నివాస యోగ్యమైనదిగా నిర్ణయించుకున్నాడు. సైనికులు తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లిపోతుండడంతో ఇక్కడ గ్రామ నిర్మాణం అవసరాన్ని గుర్తించాడు. సమీపంలోని దేవునికడప గ్రామ వాసుల్లో కొందరిని ఒప్పించి ఇక్కడికి రప్పించాడు. బుగ్గవంక కట్టపై సకల సౌకర్యాలతో వారికి నివాసాలు, ఆంజనేయస్వామి ఆలయం కట్టించాడు.

అందమైన భవనం

రజాక్‌అలీ చాలా సుందరంగా పటిష్టంగా విశాలంగా బుగ్గవంక ఒడ్డునే తన రాజ మందిరాన్ని నిర్మించుకున్నాడు. బయటి నుంచి చూస్తే కోటలా అనిపించే ఈ భవనంలోకి వెళ్లేందుకు విశాలమైన ప్రధాన ద్వారాన్ని నిర్మించాడు. ఇరువైపులా ఎత్తయిన బలమైన మినార్లను కూడా కట్టాడు. కిందివైపు కాపలాగది, పైన రెండు అంతస్తుల గదులను ఇస్లామిక్ శైలిలో అందంగా రూపుదిద్దారు. లోపల రాణులు, పరిచారికల గదులు కూడా నిర్మించారు. నేక్‌నామ్‌ఖాన్ పేరిట కళాక్షేత్రాన్ని కూడా కట్టారు. ఒకప్పటి ఆ ప్రాంగణంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, హైస్కూలు, చిల్డ్రన్ హోం, టెలికాం కార్యాలయాన్ని నిర్మించారు. మినార్లు గల ప్రధాన ద్వారం నుంచే రాకపోకలు సాగేవి. శుక్రవారం నాడు రాజ మందిరం వెలుపల ప్రధాన ద్వారం సమీపంలో రాజ మహిళల కోసం ప్రత్యేకంగా బజారును ఏర్పాటు చేసేవారు. మినార్ల సమీపంలో ఉండడంతో దీన్ని మీనా(ర్) బజారుగా వ్యవహరించేవారు.

నాటి బురుజు.. నేటి టవర్ క్లాక్

ఇంత వరకు అందరూ భావిస్తున్నట్లు మినార్ల వెనుకగల ఉన్నది కోట కాదు, రాజ భవనం మాత్రమే. కానీ కోటలాంటి దర్పం కనిపించాలన్న ఉద్దేశంతో నవాబు కోటకు ఎదురుగా ఒక బురుజును కట్టించారు. అదే నేటి టవర్ క్లాక్. దాంతోపాటు పాత బస్టాండులోని ఎన్‌జీఓ హోం వద్ద గల రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయ ప్రాంగణంలో మరొక బురుజు ఉంది. అంటే రాజభవనానికి ఇరువైపులా రక్షణ కోసం సిపాయిలు పహారా కాసేందుకు వీటిని నిర్మించారు.

దీన స్థితిలో..

ఒకప్పుడు రాచఠీవితో జిల్లాకు గర్వకారణంగా నిలిచిన చారిత్రక భవనం నేడు మరమ్మతులు, నిర్వహణ లేక శిథిలమైంది. ప్రస్తుతం నాటి రాచరికాన్ని చాటుతూ కేవలం ఈ మినార్లు మాత్రమే కనిపిస్తున్నాయి. ఇవి నాటి ఇస్లామిక్ సంప్రదాయ నిర్మాణ శైలికి అద్దం పడుతున్నాయి. ఇవి కూడా పెచ్చులూడుతూ ఇటుకలు బయటపడి శిథిలస్థితిని తెలుపుతున్నాయి. చుట్టూ చెట్లు పెరిగి ఉండడంతో మినార్లు ఉన్నాయని బయటికి కనిపించడం లేదు. వీటిని స్మారక కట్టడాలుగా ప్రకటించినట్లు పురావస్తుశాఖ బోర్డులు ఉన్నా నిర్వహణ మాత్రం లేదనే చెప్పవచ్చు.

నగరానికి వరం



ఈ మినార్లు కడప నగరానికి వరం లాంటివి. నాటి ఇస్లామిక్ సంప్రదాయ శైలిని ప్రతిబింబిస్తూ నిన్నటి చరిత్రకు సజీవ సాక్ష్యంగా, గర్వంగా నిలిచి ఉన్నాయి. సంబంధిత శాఖలు వీటిని కాపాడుకునేందుకు చర్యలు చేపట్టాలి.

– వి.డేవిడ్‌రాజ్, కడప

రక్షించుకోవాలి



కడప నగరాన్ని వ్యవస్థీకరించింది నవాబులేనని ఈ మినార్లు తెలుపుతున్నాయి. ఇలాంటి చారిత్రక కట్టడాలను నిలుపుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. రానున్న తరానికి కడప నవాబులు, మయాన నవాబుల చరిత్ర తెలియాలి.

– రాఘవేంద్రవర్మ, కడప

క్లుప్తంగా

మారెమ్మకు విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కడప కల్చరల్ : కడప నగరం ఎర్రముక్కపల్లె కందిపాలెంలోని గ్రామ దేవత శ్రీ జగన్మాత మారెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధుల కుటుంబ సభ్యులు అమ్మవారికి అభిషేకం నిర్వహించి తొలి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు, న్యాయవాది సట్టి భారవి ఆధ్వర్యంలో ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన భక్తులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన పలువురు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉదయం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి మేళతాళాలతో బోనాలను సమర్పించారు. అందులోని చల్లను అమ్మవారికి సమర్పించారు. నిర్వాహకులు దాన్ని భక్తులకు ప్రసాదంగా అందజేశారు.

ఎస్‌ఐలు బాధ్యతల స్వీకరణ


చిన్నచౌక్ ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి


వన్‌టౌన్ ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి


రిమ్స్ పీఎస్ ఎస్‌ఐ జయరాములు

కడప అర్బన్ : వైఎస్‌ఆర్ జిల్లా వ్యాప్తంగా ఇటీవల ఎస్‌ఐల బదిలీలు జరిగాయి. ఈ క్రమంలో కడప నగరంలో ఆదివారం ముగ్గురు ఎస్‌ఐలు తమకు కేటాయించిన పోలీస్‌స్టేషన్లలో బాధ్యతలు చేపట్టారు. 2012 బ్యాచ్‌కు చెందిన వీరు విధుల్లో చేరారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతుగా కృషి చేస్తామని వారు తెలియజేశారు. కడప చిన్నచౌక్ ఎస్‌ఐగా ఎన్.రాజరాజేశ్వర్‌రెడ్డి, కడప ఒన్‌టౌన్ ఎస్‌ఐగా జి. అమర్‌నాథ్‌రెడ్డి, కడప రిమ్స్ పీఎస్ ఎస్‌ఐగా యు.వై.జయరాములు బాధ్యతలను చేపట్టారు. వారు విధుల్లో చేరగానే తమ సీఐలను, ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. కడప ఒన్‌టౌన్ సీఐ సి.భాస్కర్ రెడ్డిని ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టాలి


ఎస్పీకి అంబేడ్కర్ చిత్రపటం బహూకరిస్తున్న మాలమహానాడు నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులకు అడ్డుకట్ట వేసేలా తగిన చర్యలు చేపట్టాలని ఏపీ రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జాకట విజయ్ శేఖర్ కోరారు. ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన హర్షవర్ధన్‌రాజును ఆయన ఆదివారం కలిసి అంబేడ్కర్ చిత్రపటం బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల దళిత వర్గాలపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లోని నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఇందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఇల్లూరి సురేష్, రాయలసీమ అధ్యక్షుడు జేష్టాది భాస్కర్, కడప నగర అధ్యక్షుడు చెంచుల డేవిడ్ సత్యారాజ్, జమ్మలమడుగు తాలూకా యూత్ అధ్యక్షులు జె.దీపక్, పోతుబోయిన చంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పరిశీలన


వీసీ విశ్వనాథకుమార్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న స్కిల్ సెంటర్ ప్రతినిధులు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథకుమార్ ఆదివారం వైజాగ్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను పరిశీలించారు. విశాఖపట్నంలోని హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సహకారంతో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యువత కోర్సులతోపాటు నైపుణ్యాలు సాధించేందుకు ఇలాంటి సెంటర్‌లు దోహదం చేస్తాయన్నారు. నైపుణ్యాలకు పదునుపెట్టే ఇలాంటి సెంటర్‌ల ఆవశ్యకతపై స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో వీసీ చర్చించారు. అనంతరం వీసీని వారు జ్ఞాపికతో సత్కరించారు. సమావేశంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సీఈఓ ఇంతియాజ్ అర్షద్, చీఫ్ మేనేజర్ ఇంద్రజిత్ ముఖర్జీ, సీనియర్ మేనేజర్ ఎస్‌టీవీఎస్ మూర్తి, అసిస్టెంట్ మేనేజర్ ఎం.హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ విద్యా సదస్సులు

వైవీయూ: రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఉర్దూ విద్యాసదస్సులు నిర్వహించనున్నట్లు రూటా ఏపీ అధ్యక్ష, కార్యదర్శులు ఇమాంబాషా, సయ్యద్ ఇక్బాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ, స్పెషల్ డీఎస్సీ నిర్వహణ, ఉర్దూ అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటు తదితర డిమాండ్లపై చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోనున్నట్లు వారు పేర్కొన్నారు.

13న స్వాతంత్య్ర దినోత్సవ ర్యాలీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : భారత స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 13న జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ఉదయం 9 గంటలకు కడప కోటిరెడ్డిసర్కిల్‌లో ప్రారంభమయ్యే ర్యాలీ ఏడురోడ్లు, వైవీ స్ట్రీట్‌వద్ద గల గాంధీజీ విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

'ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలి'

కడప రూరల్ : పెండ్లిమర్రి మండల స్థాయి అధికారి అవినీతిపై చర్యలు తీసుకోవాలని కడప నగరానికి చెందిన హరికృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండ్లిమర్రి మండలంలో మండల స్థాయి అధికారులు ఇసుకతోపాటు పలు అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని కోరారు.

రెగ్యులర్ డీసీఓను నియమించాలి

వైవీయూ : జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్‌ను వెంటనే నియమించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెగ్యులర్ డీసీఓ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గురుకులాల్లో సమస్యలు పేరుకుపోవడానికి కారణం రెగ్యులర్ డీసీఓ లేకపోవడమేనన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే రెగ్యులర్ డీసీఓ నియామకం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో హేమచంద్ర, నవీన్ పాల్గొన్నారు.

రాజదండం స్థానంలో రాజ్యాంగం ప్రతిష్టించాలి


విజయవాడ సదస్సు కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాజదండం స్థానంలో రాజ్యాంగం ప్రతిష్టించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో రాజదండం స్థానంలో రాజ్యాంగం ప్రతిష్టించాలి అనే అంశం పైన విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజ్యాంగ వ్యతిరేకంగానే పాలన సాగిస్తోందన్నారు. రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను నిర్వీర్యం చేసి దేశంలో చక్రవర్తి పాలన తీసుకురావాలని ప్రయత్నిస్తోందన్నారు. విజయవాడ సదస్సుకు ముఖ్య అతిథులుగా న్యూఢిల్లీకి చెందిన రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎంఏ గఫూర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గిడుగు రుద్రరాజు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి. వేణుగోపాల్, కే.సీ.బాదుల్లా, చంద్రశేఖర్, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి జు.మునెయ్య, నగర నాయకుడు చంద్రగుప్త తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన

కడప కల్చరల్: స్థానిక ఎర్రముక్కపల్లె–భాకరాపేట (విశ్వనాథపురం) వద్దగల రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు ఆదివారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిలు శంకుస్థాపన చేశారు. ఈ బ్రిడ్జిని రూ.10 కోట్ల వ్యయంతో పది మీటర్ల వెడల్పుతో ఇన్–అవుట్ రెండు మార్గాలను నిర్మించనున్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, సెంట్రల్ రైల్వే ఇంజనీర్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలి

కమలాపురం : సర్వరాయ సాగర్ పంట కాలువలను పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం కమలాపురంలో నిర్వహించిన ఏరియా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గాలేరు–నగరి సుజల స్రవంతి రెండో దశ పనులను వేగవంతం చేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సీపీఐ దశల వారీ పోరాటం చేసేందుకు సమాయత్తం అవుతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కమలాపురం నియోజకవర్గానికి అధిక నిధులు కేటాయించి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్‌లను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పాలస్తీనాను ఆక్రమిస్తున్న ఇజ్రాయిల్‌ను బలపరచకూడదు


సదస్సులో మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ సుభాన్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : పాలస్తీనాను ఆక్రమిస్తున్న ఇజ్రాయిల్‌ను భారత్ బలపరచకూడదని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అబ్దుల్ సుభాన్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో 'పాలస్తీనా సంఘీభావ సదస్సు'ను ఆవాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి (యు.ఎన్.ఓ.) గుర్తించిన సభ్య దేశమైన పాలస్తీనాలోని 90 శాతం భూభాగాన్ని అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ ఆక్రమించేసిందని, 39 లక్షల మంది పాలస్తీయన్లను హత్య చేసిందన్నారు. స్థానిక పాలస్తీయన్లు దేశ స్వాతంత్య్రం కోసం పోరాడుతున్నారని తెలిపారు. పార్లమెంటులో వక్ఫ్ బోర్డు సవరణ చట్టం బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దానిని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ, తర్వాత సబ్ కమిటీ, రాజ్యసభకు పంపించి నిపుణులచే సలహాలు, సూచనలు తీసుకున్నాక, సమగ్ర చట్టం తీసుకురావాల్సి ఉండగా, ఏకపక్షంగా సవరణలు చేయడం అనేక అనుమానాలకు తావిస్తోందని అన్నారు. దేశంలోని మైనార్టీ ప్రజల హక్కులు, భద్రత, భారత దేశ రాజ్యాంగం ఫెడరల్, లౌకిక వ్యవస్థ లక్ష్యమన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణ మెజార్టీ ఇవ్వకుండా ప్రజలు తీర్పు ఇచ్చినా ఆ పార్టీ ఆలోచన విధానంలో మార్పు రాలేదన్నారు. ముస్లిం జేఏసీ నాయకుడు బాబు భాయ్ మాట్లాడుతూ... భారతదేశంలో 9 లక్షల 40 వేల ఎకరాల వక్ఫ్‌బోర్డ్ భూములు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో 70 వేల ఎకరాలు భూములు ఉన్నాయని, అందులో 32 వేల ఎకరాలు కబ్జాకు గురయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, వోలామా అయ్యమ్మ కమిటీ మౌలానా అక్బర్ అలీ, జమియా ఉలామా కమిటీ ఎస్. నిజాముద్దీన్, ముస్లిం ఫెడరేషన్ ఎస్.నజీర్ హుస్సేన్, ఎంహెచ్‌పీఎస్ ఎస్.నాజర్‌బాషా, సీపీఎం కడప నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్, న్యాయవాది ఎస్.మహమ్మద్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటు కాదు.. పదోన్నతులు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున

వైవీయూ : రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వం తీసుకువచ్చిన 117 జీఓ ప్రకారం ఇప్పుడు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు చేయడం సరికాదని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ నంబర్ 117ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. లోపభూయిష్టమైన జీఓను రద్దు చేయకుండా, ఆ జీఓ ఆధారంగా పని సర్దుబాటు చేయడం సరికాదన్నారు. ఇంగ్లిషు మీడియంతోపాటు తెలుగు మీడియం ప్రవేశ పెట్టాలన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చిన తర్వాత వర్క్ అడ్జెస్ట్‌మెంట్ లేదా రేషనలైజేషన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు ఎం.గంగరాజు, కార్యదర్శి కె.గంగాధర్ పాల్గొన్నారు.

ఖాళీలు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను మెథడాలజీ ఆధారంగా ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేయాలనే ఆలోచన విరమించి మెథడాలజీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. ఒక సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 20–25 ఏళ్ల పాటు ఒకే క్యాడర్‌లో పనిచేస్తున్నప్పటికీ పదోన్నతి కల్పించే అవకాశాలు కనిపించడం లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత పాఠశాలల్లో 17 సబ్జెక్టులకు సంబంధించి టీచర్ల కొరత ఉందన్నారు. అందులో 70 శాతం పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. అందువల్ల ఖాళీ అయ్యే ఎస్‌జీటీ పోస్టుల విషయంలో విద్యా వలంటీర్లను నియమించాలన్నారు. అలా కాకుండా విద్యార్హత కలిగిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను సర్దుబాటు పేరుతో ఉన్నత పాఠశాలల్లో వినియోగించుకోవాలనుకోవడం సరైన విధానం కాదన్నారు. పదోన్నతి కల్పిస్తే మరింత ఉత్సాహంగా పని చేస్తారని తెలిపారు.

నిలుపుదల చేయాలి

వైవీయూ: పాఠశాలల్లో నిర్వహించదలచిన ఉపాధ్యాయుల సర్దుబాటు వెంటనే నిలుపుదల చేయాలని ఏపీ టీఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు సీవీ ప్రసాద్, చెంగలరెడ్డి కోరారు. ప్రభుత్వం 117 జీఓను రద్దు చేసి, సమాంతర మాధ్యమాన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేయాలన్నారు. 53 జీఓ ప్రకారం వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేయాలని, అంతకంటే ముందుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. విద్యాశాఖ మంత్రి వెంటనే ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.